క్లుప్తంగా

హెల్త్ వలంటీర్లను నియమించాలి

అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో తక్షణం హెల్త్ వలంటీర్లను నియమించాలని భారత ఆదివాసీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మన్యంలో వర్షాకాలం కావడంతో వసతి గృహాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడానికి ప్రతి వసతి గృహాల్లో, పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లు నియమించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుక



వేడుకలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు శ్రీవారి కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. అనంతరం జరిగిన కోలాటంతో పాటు చిన్నారుల భజన గీతాలు ఆకుట్టుకొన్నాయి. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


నిధుల కేటాయింపునకు వినతి



ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: అభివృద్ధికి దూరంగా ఉన్న గూడెంకొత్తవీధి మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీలుగా జిల్లా పరిషత్ నుంచి అదనంగా నిధులు కేటాయించాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ కోరారు. ఆయన శుక్రవారం ముంచంగిపుట్టులో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతులను అందజేశారు.ప్రాధాన్యతా క్రమంలో అవకాశాలను బట్టి అవసరమైన చర్యలు తీసుకుంటారని జెడ్పీ చైర్‌పర్సన్ తెలియజేసినట్టు రామకృష్ణ తెలిపారు.

94 మందికి వైద్య పరీక్షలు



ఎస్.పెదబయలులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ ఎస్.పెదబయలు, చిలకలమామిడి, కొత్తకుండలు, దబ్బగరువు గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. గిరిజన గ్రామాల ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 44 మందికి బీఎస్‌లు, 10 మందికి ఆర్‌డీటీలు పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. వైద్య శిబిరాలను సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు పరిశీలించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి నాణ్యమైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. 94 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

జోరుగా వరినాట్లు

రాజవొమ్మంగి: మండల వ్యాప్తంగా వరి నాటు పనులు ఊపందుకొన్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో సాగునీటి వనరుల్లోకి పుష్కలంగా నీరు వచ్చి చేరింది. సాగునీటికి ఇబ్బంది లేకపోవడంతో ఊడ్పులు మొదలు పెట్టారు. గత రెండు రోజులుగా వాతావరణం అనుకూలించడంతో నాట్లు పనులు మొదలు పెట్టారు . మండలంలో రైతులు 5,660 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు చెప్పారు. కూటమి ప్రభుత్వం ద్వారా ఈ ఏడాది సాగు పెట్టుబడి సాయం ఇంకా అందలేదని, గత్యంతరం లేక అప్పులు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టంలో గర్భిణులకు బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో బాలచంద్రమణిదేవి



పెదవలసలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది



మల్లవరంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో విజయకుమారి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాశన చేస్తున్న సీడీపీవో లక్ష్మి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



అరకులోయలో ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో శారద, సిబ్బంది



కోతులగుట్టలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో నాగలక్ష్మి, సిబ్బంది

- వాడవాడలా తల్లిపాల వారోత్సవాలు
- గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన

అరకులోయ రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో జరిగిన కార్యక్రమాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గన్నెల, అరకులోయ, బస్కీ పంచాయతీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో శారద మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. నవజాతి శిశువుకు తల్లిపాలు ఎంతో ఉపయోగమని, రోగనిరోధక శక్తి పెంచుతోందని బాలింతలు, గర్భిణులకు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మి, పార్వతి, అరుణ, సిబ్బంది మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని పట్టం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణి మాట్లాడుతూ తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. బాలింతలు,



నెల్లిపూడిలో మాట్లాడుతున్న సీడీపీవో లక్ష్మి

గర్భిణులు మంచి బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని చిన్నబంధవీధి సెక్టార్‌లోని లక్కుళ్లు, బంధవీధి, సెక్టార్‌లో కె.కోడాపల్లి గ్రామాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సువర్ణమ్మ తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.విజయలక్ష్మి, ఎస్.సత్యవతి, ఎం.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరలు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో వైద్యాధికారులు, సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భం



లక్కుళ్లు గ్రామంలో తల్లిపాలు వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ

గా అవగాహన ర్యాలీ చేశారు. వైద్యాధికారి కోమలి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఎంపీహెచ్ఈఓ బాలరాజు, వైద్యసిబ్బంది దేవమణి, రోజ్‌గోల్డ్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి ఆధ్వర్యంలో మండలంలోని కంఠారం సెక్టార్ మల్లవరంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు బలవర్ధమైన ఆహారం తీసుకోవాలని, రక్తహీనత సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బిడ్డకు తల్లిపాలు చాలా ముఖ్యమన్నారు. సూపర్‌వైజర్ బాలామణి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని నెల్లిపూడి, ఏటిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్.లక్ష్మి మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలు చాలా అవసరమన్నారు. పుట్టినబిడ్డ అరగంటలోగా తల్లిపాలు అందజేయాలని సూచించారు. ముర్రుపాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచుతోందన్నారు. బాలింతలు అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల బిడ్డకు సమృద్ధిగా పాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు సీడీపీవో లక్ష్మి అన్నప్రాసన చేశారు. సూపర్‌వైజర్లు జయలక్ష్మి, సత్యవతి, మహిళ సంరక్షణ కార్యదర్శిలు వెంకటలక్ష్మి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని కోతులగుట్ట ఏపీఆర్ గురుకులం పాఠశాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో పి.నాగలక్ష్మి మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తల్లిపాలు పట్టిస్తే రోగనిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుందని సూచించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తుందన్నారు. తల్లిపాల ప్రయోజనం గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలను కోరారు. సూపర్‌వైజర్, హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, ఎంఎల్ హెచ్‌పీ వెంకటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశలు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు




అడుగులపుట్టులో వర్మీ కంపోస్ట్ ఎరువును రైతులకు పంపిణీ చేస్తున్న ఈవోఆర్‌డీ, ఉపాధి సిబ్బంది

పెదబయలు: సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం చేపట్టింది. మండలంలోని అడుగులపుట్టు గ్రామ సచివాలయం సమీపంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యుపిసి)లో శుక్రవారం ఈవోఆర్‌డీ నర్సింగరావు ఆధ్వర్యంలో రైతులకు కిలో రూ.10 ధరతో రైతులకు అమ్మకాలు చేశారు. ఇటీవల ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు మొక్కల పంపిణీ జరుగుతుంది. ఈ మేరకు ఈ కేంద్రం నుంచి తక్కువ ధరకు అందుబాటులో ఉన్న వర్మీ కంపోస్ట్ ఎరువును రైతులు కొనుగోలు చేస్తున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఒక్క రోజు రూ.250 కిలోల వర్మీకంపోస్ట్ ఎరువును రైతులకు అమ్మకం చేసినట్టు తెలిపారు. అనంతరం ఈవోఆర్‌డీ మాట్లాడుతూ రైతులు రసాయక ఎరువులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అడుగులపుట్టులో ఉన్న సంపద తయారీ కేంద్రంలో టన్ను వర్మీకంపోస్ట్ ఎరువు అందుబాటులో ఉందన్నారు. మండలంలోని ఎవరైన రైతు టన్ను పశువుల గెత్తం కేంద్రానికి ఇస్తే వర్మీ కంపోస్ట్ తయారు చేసి టన్నులో సగం 500 కిలోలు ఇవ్వడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీవో చిన్న అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు వరిసాగులో శాస్త్రీయ విధానాలను ఆచరించాలని గిరిజన వికాస్ మాతోట ప్రతినిధులు రమ్మ, పోతురాజు కోరారు. మంగళపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సేంద్రియ సాగు ధ్రువపత్రాల జారీకి సంబంధించి ఆచరించాల్సిన పద్ధతులను వారు వివరించారు.

కొయ్యూరు: రైతులు వరి నాట్లు వేసే సమయంలో ఎకరాకు 25 కిలోల యూరియాను మాత్రమే వేయాలని ఏవో ఉమాదేవి సూచించారు.ఒకే సారి 50 కిలోలు వేయవద్దన్నారు. చీడిపాలెం రైతు సేవా కేంద్రంలో యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నాట్లు వేసే సమయంలో 25కిలోలు వేసి నెల తరువాత మరో 25 కిలోల యూరియాని వేయాలని సూచించారు. యూరియాను రెండుసార్లు వేయడం ద్వారా పోషకాలు చేరుతాయన్నారు.

ఉధృతంగా గెడ్డలు, వాగులు



అప్పలరాజుపేటలోని వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు



కుండాడ -ముంజుమామిడి మార్గంలో కల్వర్టపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగి పరిసరాల్లో శుక్రవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలకు పైగా కుండపోతగా కురిసిన వర్షానికి మండలంలోని వాగులు ప్రమాదస్థాయిలో పొంగి ప్రవహించాయి. దీంతో ఉదయం 10 గంటల వరకు వాగులు దాటే వీలులేక పలు గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. భారీ వర్షం కారణంగా రోడ్లపైకి నీరు చేరడంతో వాహన చోదకులకు అవస్థలు తప్పలేదు. మండలంలోని అప్పలరాజుపేట వద్ద గల వట్టిగెడ్డ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్ పూర్తిగా నిండిపోవడంతో వరద నీరు పొర్లు మదుము ద్వారా దిగువకు ప్రవహించింది. మరో వైపు మండలంలోని శరభవరం, కొండపల్లి, నెల్లిమెట్ల, లబ్బర్తి, జడ్డంగి తదితర గ్రామాల్లోని కొండవాగులు పొంగి ప్రవహించింది. సాగుభూములు వర్షపు నీటితో నిండి చెరువులను తలపించాయి.

మారేడుమిల్లి: మండలంలో కురుస్తున భారీ వర్షాలకు వరదనీరు చేరి కొండ కాలువలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు ఎడితెరిపి లేకుండా గ్రామంలో భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలోని కల్వర్టుపై నుంచి కాలువుల, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. స్థానిక మసీద్ సెంటర్ సమీపంలోని ఓ ఇంటి వద్దకు వరద నీరు చేరి ఎదుటభాగం నీటిలో మునిగిపోయింది. అలాగే మారేడుమిల్లి నుంచి కుండాడ, జీయం వలస గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నుంచి, కుండాడ నుంచి ముంజుమామిడి గ్రామానికి వెళ్లే రహదారి మీద ఉన్న కల్వర్టుపై నుంచి కొండ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం నెలకొంది.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరావు

హుకుంపేట: మండల కేంద్రంలోని మోదమాంబ కాలనీలో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో గిరిజనులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గిరిజనులు ముందస్తు జాగ్రత్త పడాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో రోణంకి వెంకటరావు మాట్లాడుతూ గిరిజనులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సిల్వర్‌ఓక్ మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: మండలంలో గల కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక రైతకు ఎకరానికి 700 మొక్కలు అందించడం జరుగుతుందని, మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 430 మంది రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్క రైతు జాగ్రత్తలు పాటిస్తూ మొక్కలను పెంచాలని, కించాయిపుట్టు పంచాయతీల్లో నాలుగు గ్రామాలకు చెందిన 70మంది రైతులకు 50వేల మొక్కలు త్వరలో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఏపీవో సంఘంనాయుడు, ఈసి సత్యారావు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ బాబూరావు, టిఏ జోగారావు, వీఆర్‌పీ రాంబాబులు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

జి.మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్ విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, మత్తు వంటి చెడు వ్యవస బారిన పడిన గిరిజన యువత జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య పట్ల దృష్టితో భవిష్యత్తుకు ఉన్నత బాటలు వేసుకోవాలని వారు సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులతో తల్లిదండ్రుల కలలు సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కళాశాల, వసతి గృహాల్లో ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తినా తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించటానికి కృషి చేస్తామన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెదవలసతోని బాలుర పాఠశాలలో విద్యార్థులకు గంజాయి సాగు, రవాణా వల్ల అనర్థాలపై సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అనంతరం గంజాయి సాగు, రవాణాకు పాల్పడవద్దంటూ వారపు సంతలో విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు.



జి.మాడుగులలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్



పెదవలసలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి

మోతుగూడెం: డొంకరాయి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ , గిరిజన బాలికల ఉన్నత పాఠశాలల్లో ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, కొత్త చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఈ సందర్భంగా డొంకరాయ ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ గంజాయి పండించడం, రవాణా చేయడం, తాగడం నేరం అని తెలియజేశారు. గంజాయి నివారణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త చట్టాలు మరింత కఠినంగా ఉన్నాయని తెలిపి, కొత్త చట్టాలపై అవగాహన పెంపొందించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



పాడేరు-చింతపల్లి మార్గంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

జి.మాడుగుల: కాలంచెల్లిన , పాడైన ఆర్టీసీ బస్సులతో గిరిజన ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులు, సమస్యలు ఎదర్కొంటున్నారు. పాడేరు, ఇతర ప్రాంతాల నుంచి జి.మాడుగుల, చింతపల్లి, జీకె వీధి వంటి ప్రాంతాలకు నిత్య ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రయివేటు ఉద్యోగులు, ప్రయాణిలు ఆర్టీసీ బస్సుల్లో తమ విధుల కోసం ప్రయాణిస్తున్నారు. పాడేరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో కొన్ని కాలం చెల్లడంతో బస్సులు ఎక్కడ మొరాంచి నిలచిపోతాయో చెప్పలేని పరిస్థితి ఉంది. అందులో భాగంగానే పాడేరు ఆర్టీసీ డిపోకు చెందిన పాడేరు-చింతపల్లి ఆర్టీసీ బస్సు సర్వీస్ శుక్రవారం కె.కోడాపల్లి దగ్గరకు వచ్చే మొరాయించి నిలిచిపోయింది.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు నిలిచిపోవడంతో గత్యంతరం లేక అధిక టికెట్ ధరలు చెల్లించి ప్రయాణిలకు గమ్యస్థానం చేరాల్సి వచ్చింది. పాడేరు ఆర్టీసీ డిపోకు కొత్త బస్సు సర్వీస్‌లతో ప్రయాణికుల ఇబ్బందులు, సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొక్కల పంపిణీ

గంగవరం : ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పంపిణీ చేసిన మొక్కలను సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ కె.గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ అన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్ ఆధ్వర్యంలో మండలంలో పలు గ్రామాల రైతులకు వివిధ రకాల ఉద్యాన వన మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీవో ప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని దోనెలపల్లి, పిడతమామిడి, మొల్లెరు, గంగవరం, లక్కొండ, యండపల్లి, పంద్రప్రోలు ప్రాంతాలకు చెందిన 55 మంది రైతులకు మామిడి, కొబ్బరి, అల్ల నేరేడు మొక్కలను అందజేసినట్టు చెప్పారు. సర్పంచులు కుంజం లక్ష్మి, నేషం మరిడమ్మ, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు పాము అర్జున, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ తదితరులు

వ్యాధులతో మూగజీవాల మృతి



మృతి చెందిన మేక

అరకులోయ రూరల్: మండలంలో లోతేరు మారుమూల గ్రామ పంచాయతీ వంతలగుడ, కురిసేలా, సిరోసుగుడ, తోడుబంధ తదితర గ్రామాల్లో పశువులు, మేకలకు గొర్రెలకు విరేచనాలతో పాటు వివిధ రోగాలు ప్రబలి పది రోజుల వ్యవధిలో 18 మేకలు, గొర్రెలు మృతి చెందినట్టు రైతులు శుక్రవారం తెలిపారు. వంతలగుడ గ్రామానికి చెందిన రైతు రాంచందర్‌కు సంబంధించి 6 , గోవింద్‌కు చెందిన– 4,అప్పన్నకు చెందిన-5, రాంబాబుకు చెందిన-3 చొప్పున మేకలు, గొర్రెలు మృతి చెందినట్టు వారు చెప్పారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాలని, మూగజీవాల మృతితో తీవ్ర నష్ట పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో గ్రామ వలంటీర్లు ఉండడంతో ఎటువంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారుల దృష్టిలో తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేసుకునే వారని నేడు ఆ పరిస్థితి లేదంటున్నారు. ప్రస్తుతం అధికారులు గ్రామాల్లో సక్రమంగా లేక పూర్తి సమాచారం అందక నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, పశువులకు, మేకలు, గొర్రెలకు వ్యాక్సీన్లు వేయాలని కోరుతున్నారు.

పాఠశాల కోసం గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

అరకులోయ రూరల్: మండలంలో సుంకరమెట్ట పంచాయతీ పిరిబంధ పీటిజీ గ్రామంలో శాశ్వత పాఠశాల భవనం నిర్మించాలని శుక్రవారం గ్రామానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, సర్పంచ్ చిన్నబాబులు మాట్లాడుతూ గ్రామంలో 75 పీటీజీ కుటుంబాలు నివాసిస్తున్నాయని, సుమారు 30 మంది విద్యార్థులున్నారని చెప్పారు. గ్రామంలో పాఠశాల భవనం లేక పాకలో తరగతులు కొనసాగుతున్నాయన్నారు. వర్షాలు కురిసినపుడు పాకలో నీరు చేరి తరగతుల నిర్వహణ కష్టంగా మారుతోందని, గత్యంతరం లేక సెలవు ప్రకటించాల్సి వస్తోందని చెప్పారు. చిన్నారుల విద్యాభ్యాసం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని చెప్పారు. తక్షణమే ఉన్నతాధికారులు, యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు నానిబాబు, శారద, నర్సమ్మ, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.